సాక్షి వికారాబాద్

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



నష్టాలతో మార్కెట్ మూత

మోమిన్‌పేటలో ఏర్పాటైన అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వరుస నష్టాల్లో కూరుకుపోయింది. 8లో▸



ప్రభుత్వమే ఆదుకోవాలి

యాలాల బీసీ బాలికల వసతి గృహంలో సిలిండర్ పేలి గాయపడిన వారిని ఆదుకోవాలని బీసీ సంఘం నేతలు కోరారు. 8లో▸



పత్తి పైసలందక పాట్లు

పత్తి విక్రయించి నెల రోజులు అవుతున్నా రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు

పట్టణ సీఐ సంతోష్‌కుమార్



ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న పట్టణ సీఐ సంతోష్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

తాండూరు రూరల్: ఇసుక అక్రమ రవాణాపై బుధవారం సాక్షి దిన పత్రికలో 'అనుమతి చాటున అడ్డదారి' అనే శీర్షికన ప్రచురితమైనవార్తకు పోలీసులు స్పందించారు. బుధవారం పట్టణ సీఐ సంతోష్‌కుమార్ మండలంలోని ఖాంజాపూర్‌లో ట్రాక్టర్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి పొందిన తరువాతే ఇసుక రవాణా చేసుకోవాలని సూచించారు. ట్రాక్టర్ డ్రైవర్‌కు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇసుక రవాణా చేసే సమయంలో అన్ని పత్రాలు అందుబాటు ఉండాలని, లేకుంటే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నులిపురుగులను నివారిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: పిల్లల ఎదుగుదలకు అడ్డుగా మారే నులి పురుగులను నివారిద్దామని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. పాఠశాలల్లో ప్రతి విద్యార్థికీ మాత్రలు అందేలా చూడాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించేలా చూడాలన్నారు. ఈ నెల 19వ తేదీలోగా వంద శాతం మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. రెండు సంవత్సరాల వయస్సు లోపు వారికి అర మాత్ర, రెండు నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ఒక మాత్ర ఇవ్వనున్నట్లు చెప్పారు. భోజనం చేసిన తరువాతే మాత్ర వేసుకోవాలని సూచించారు. ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వాన్ కుమార్, డీఈఓ రేణుకాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి, మెప్మా పీడీ రవికుమార్, డీఐఓ డాక్టర్ బుచ్చిబాబు, స్టాటిస్టికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అక్బర్

అనంతగిరి: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో విద్యావ్యవస్థ మొత్తం నిర్వీర్యం అయ్యిందని మండిపడ్డారు. పాఠశాల, కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యను కార్పొరేట్ చేతుల్లో నుంచి ప్రభుత్వ పరం చేయాలన్నారు.

రేపు సామాజిక తనిఖీ

కొడంగల్ రూరల్: ఈ నెల 9వ తేదీ ఉదయం 10గంటలకు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీకి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ రాములు తెలిపారు. 13వ విడతకు సంబంధించి ఏప్రిల్ ఒకటి 2022 నుంచి మార్చి 31 2023 వరకు ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రైవేట్ వయా గవర్నమెంట్

- ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను ప్రైవేటు క్లినిక్‌లకు రెఫర్ చేస్తున్న వైద్యులు
- అక్కడ వారికి వైద్యం, శస్త్ర చికిత్సలు చేసేది వారే..
- వారానికి ఒకరోజే విధులకు..
- పేరుకే ప్రభుత్వ వైద్యులు.. సేవలన్నీ ప్రైవేటులోనే..
- వైద్య విధాన పరిషత్ బాస్‌దీ అదేతీరు



పరిగి ఏరియా ఆస్పత్రి

వికారాబాద్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో పర్యవేక్షణ గాలిలో దీపంలా మారింది. వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారే జిల్లా పెద్దాసుపత్రుల పర్యవేక్షణను గాలికొదిలేసి ప్రైవేటు క్లినిక్ నిర్వహిస్తున్నారు. డ్యూటీ వేళల్లో కూడా ఆయన ప్రైవేటు క్లినిక్‌కే పరిమితమవుతున్నారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు సైతం డీసీహెచ్‌ఓ దారిలోనే నడుస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే వైద్యావిధాన పరిషత్ ఆధీనంలో నడుస్తున్న ఆస్పత్రుల్లో పనిచేస్తున్న డాక్టర్లు, బాస్‌ల పరిస్థితి కంచే చేను మేసిందన్న చందంగా మారింది. పేరుకే వీరందరు ప్రభుత్వ వైద్యులు.. కానీ సేవలన్నీ ప్రైవేటుకే అందుతున్నాయి. వారంలో ఒకరోజు డ్యూటీ చేసి మిగతా రోజులు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లలో సేవలందిస్తున్నారు. ఓ పక్క ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా పేదలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో పనిచేస్తుంటే వైద్యులు మాత్రం ప్రైవేటు ఆస్పత్రులను ప్రోత్సహిస్తూ సర్కారు లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.ప్రభుత్వ వైద్యులు నెలనెల జీతాలు తీసుకుంటూనే తమ క్లినిక్‌లకే ఎక్కువ సమయం కేటాయిస్తూ లక్షలు వెనుకేసుకుంటూ పేదలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షగా మారుస్తున్నారు.

నిబంధనలకు తూట్లు

జిల్లాలో వైద్యవిధాన పరిషత్‌లో పనిచేస్తున్న వైద్యులు మొదలుకుని ఉన్నతాధికారుల వరకు అందరూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. సాధారణంగా జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించే సీనియర్ వైద్యుడిని డీసీహెచ్‌ఓ(వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి)గా నియమిస్తారు. కానీ ఇందుకు విరుద్ధంగా మరో డాక్టర్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన డీసీహెచ్‌ఓ తాను పర్యవేక్షించాల్సిన నాలుగు ఆస్పత్రులను గాలికొదిలేసి ప్రైవేట్ క్లినిక్ ఏర్పాటు చేసుకొని సేవలందిస్తున్నారు. వికారాబాద్, పరిగి, మర్పల్లి, కొడంగల్‌లో ఏరియా ఆస్పత్రులు ఉండగా తాండూరులో జిల్లా ఆస్పత్రి, మదర్ అండ్ చైల్డ్ కేర్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో ఒక్కో ఆస్పత్రిని విడివిడిగా సూపరింటెండెంట్లు పర్యవేక్షిస్తుండగా ఓవరాల్‌గా డీసీహెచ్‌ఓ పర్యవేక్షిస్తారు. అయితే ఈ ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే వైద్యుల్లో 90శాతం మంది ప్రైవేటుగా క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. వీరే కాకుండా ఆస్పత్రులను పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్లు సైతం ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు.

సేవలు అధ్వానం

రెఫరల్ ఆస్పత్రులు అయిన ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో సేవలు అధ్వానంగా మారాయి. వీటిలో పని చేసే వైద్యులు వారానికి ఒక్కరోజు మాత్రమే విధులకు వస్తున్నారు. ప్రతిరోజూ ఒకరు 24గంటలు కంటిన్యూగా డ్యూటీ చేసి వెళ్లిపోతే మళ్లీ వారం తారువాత వారు డ్యూటీకి వస్తున్నారు. దీంతో వైద్య సేవలు సక్రమంగా అందక గ్రామీణ రోగులు తిరిగి ప్రైవేటు బాట పట్టక తప్పడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులను అక్కడి వైద్యులు వారు నిర్వహించే ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లాలని సూచిస్తున్నారు. డీసీహెచ్‌ఓ సైతం ప్రైవేటు క్లినిక్ నిర్వహిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇటీవల పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన పోస్టుమార్టం విషయంలో తీవ్ర దుమారం లేసిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో ఓ మృతురాలి నుంచి ఆస్పత్రి సిబ్బంది నగలు తీసుకున్నారని బంధువులు గొడవకు దిగారు. ఇందులో డీసీహెచ్‌ఓనే మధ్యవర్తిగా వ్యవహరించి బాధితులకు రూ. 20 వేలు ఇప్పించి పని చేయని వైద్యులను వెనుకేసుకొచ్చారు. ఇక డీసీహెచ్‌ఓ నిర్వహించే ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఓ ప్రజా ప్రతినిధి గొడవకు దిగడంతో ఆ పంచాయితీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. అనంతరం పెద్దల జోక్యంతో రాజీ పడ్డారు. ఇలా జిల్లాలో వైద్యుల పనితీరు ఇంత అధ్వానంగా మారినా ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై కలెక్టర్, వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని గాడిన పెట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

జిల్లా అధికారులు చొరవ చూపాలి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాం. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో 108 సిబ్బంది, అటెండర్లు వైద్యం చేశారు. కొద్ది సేపటి తరువాత ఆమె మృతి చెందింది. ఆస్పత్రికి తెచ్చిన వెంటనే వైద్యం చేసి ఉంటే బతికేది. మృతురాలి నుంచి కొన్ని వెండి నగలు కూడా దొంగిలించారు. మేము ఆందోళనకు దిగటంతో రూ. 20 వేలు ఇచ్చి ఊరుకోమన్నారు. డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకుంటున్నామని డీసీహెచ్‌ఓ హామీ ఇచ్చారు. ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు ఆర్డర్ కాపీ కూడా చూపించారు. కానీ ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. అతన్ని ట్రాన్స్‌ఫర్ కూడా చేయలేదు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరపాలి.

– శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకుడు



వికారాబాద్ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కవిత

అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలి

లేదంటే మహాధర్నా చేపడతాం

- ఏటా బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలి
- స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్

వికారాబాద్: 'అసెంబ్లీ ఆవరణలో జ్యోతి బాపూలే విగ్రహం ఏర్పాటు చేయండి.. ఏప్రిల్ 11లోపు విగ్రహం పెట్టకపోతే 12న మహాధర్నాకు దిగుతాం' అని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీలో జ్యోతి బాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బుధవారం వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అలా కాకుండా ఎన్నికలకు వెళితే బీసీ సంఘాలను ఏకం చేసి అడ్డుకుంటామని హెచ్చరించారు. బీసీలకు రిజర్వేషన్లు అమలయ్యే వరకూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనివ్వబోమని ప్రకటించారు. ఏటా అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని, బీసీ సంక్షేమ శాఖను ఏర్పాటు చేసి దానికి మంత్రిని కేటాయించాలని కోరారు. బీసీ జనగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. రాజకీయాలకు అతీతంగా మిగితా రాష్ట్రాల్లో కూడా బీసీ ఉద్యమాన్ని చేపడుతామని ఇందులో కలిసివచ్చే వారితో ముందుకు వెళ్తామని తెలిపారు. జాగృతి ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా నిర్వహించి మహిళా రిజర్వేషన్లలో బీసీలకు రిజర్వేషన్ డిమాండ్ చేశామన్నారు. పులులు, సింహాలు, కుక్కలు, నక్కలు ఇలా జంతువులు, పశుపక్ష్యాదులకు సైతం దేశంలో లెక్కలు ఉన్నాయని, కానీ బీసీలకు మాత్రం లెక్క లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. 1931లో ఆంగ్లేయులు చేసిన బీసీ లెక్కలే నేటికి దిక్కయ్యాయని తెలిపారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ సంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. ఏప్రిల్ 12న హైదరాబాద్‌లో నిర్వహించబోయే మహా ధర్నాలో ఐదు రాష్ట్రాల నుంచి బీసీ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు గట్టు రాంచందర్‌రావ్ మాట్లాడుతూ.. బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అత్యంత వెనుకబడ్డారని తెలిపారు. 85 శాతం బీసీలకు ఇప్పటి వరకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం లభించ లేదన్నారు. బీసీలు బ్యాక్ వర్డ్ కమ్యునిటీ కాదు.. సమాజానికి బ్యాక్‌బోన్ కమ్యునిటీ అని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను సమాజానికి అందించిందే బీసీలు అని తెలిపారు. ఈ ఉద్యమంలో కలిసి వచ్చే వారందరిని కలుపుకొని పోతామన్నారు. అనంతరం బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టకపోతే బీసీలందరిని ఏకం చేసి అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ప్రాజెక్టులు అప్పగించడం దారుణం

- తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కేంద్రం వద్ద తాకట్టు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం వద్ద తాకట్టు పెట్టిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించడం సబబు కాదన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తల వంచిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని 80శాతం వరకు పూర్తి చేసిందన్నారు. ఇప్పుడు శ్రీశైలం ప్రాజెక్టు కృష్ణా బోర్డు చేతుల్లోకి వెళ్లడం, కొత్తగా కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తెరమీదకు తేవడంతో పాలమూరు పథకాన్ని నిర్వీర్యం చేయడమే అని పేర్కొన్నారు. ఉదండాపూర్ జలాశయం నుంచి జిల్లాకు గ్రావిటీ కాలువల ద్వారా సాగునీటి సరఫరా కోసం పిలిచిన రూ. 5,600 కోట్ల టెండర్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి నిజంగా రైతులపై ప్రేమ ఉంటే రూ. 2లక్షల రుణమాఫీ, రైతుబంధు, వరి ధాన్యం క్వింటాలుకు రూ. 500 బోనస్, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈనెల 13న నల్లగొండలో తలపెట్టిన భారీ సభకు రైతులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు దీప, శోభారాణి, శ్రీనివాసాచారి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ విజయ్ కుమారితోకలిసి పట్టణంలోని ఈవీఎం గిడ్డంగి, మార్కెట్ యార్డులోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈవీఎంల మొదటి విడత పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ 14వ తేదీ వరకు జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈసీఐఎల్‌కు చెందిన 12 మంది సాంకేతిక నిపుణుల బృందం ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని వివరించారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

మర్పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దామస్తాపూర్‌లో పార్టీ నాయకులతో కలిసి పల్లెకు పోదాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ చేస్తామని ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో గ్రామంలో 100 మీటర్ల మురుగు కాలువ కూడా నిర్మించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్ల లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గదులు లేక ఒకటి నుంచి 3వ తరగతి వరకు ఒకే గదిలో పాఠాలు చెబుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో ఆకతాయిలు పడేసిన మద్యం బాటిళ్లను మాధవరెడ్డికి చూపించారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్లే ఆకతాయిలు వస్తున్నారని తెలిపారు. పాఠశాలలో నెలకొన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని మాధవరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, జిల్లా నాయకుడు రామేశ్వర్‌రెడ్డి, మండల నాయకులు కృష్ణారెడ్డి, రఘుపతియాదవ్, నర్సింహారెడ్డి, లక్ష్మీరామ్ తదితరులు పాల్గొన్నారు.



దామస్తాపూర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగును పరిశీలిస్తున్న మాధవరెడ్డి, పార్టీ నాయకులు

'గృహజ్యోతి' అమలుకు కసరత్తు

- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ధారూరులో పర్యటించిన ట్రాన్స్‌కో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ సుధా మాధురి

ధారూరు/దౌల్తాబాద్: గృహజ్యోతి పథకం అమలు కోసం ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న మీటర్ బిల్లింగ్ ప్రక్రియను రాష్ట్ర ట్రాన్స్‌కో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ సుధా మాధురి, ట్రాన్స్‌కో జిల్లా సూపరింటెండెంట్ జయరాజ్ పరిశీలించారు. బుధవారం వారు ధారూరులో పర్యటించి ఇంటి యజమానులతో మాట్లాడారు. విద్యుత్ వాడకం, మీటర్ రీడింగ్ వివరాలను నమోదు చేసుకున్నారు. విద్యుత్ వినియోగదారుల ఆధార్, రేషన్ కార్డులను సరిగ్గా నమోదు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం సుధా మాధురి మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకం అమలు కావాలంటే అర్హులు విద్యుత్ సిబ్బందికి ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబరు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి గృహజ్యోతి పథకం అమలవుతుందని తెలిపారు. తెల్లరేషన్ కలిగి, నెలకు 200 యూనిట్లు వినియోగించే కుటుంబాలు మాత్రమే అర్హులన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఏఓ శ్రీనివాస్ నాయక్, ఏఓ శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ సత్యనారాయణరెడ్డి, ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఏఓ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్దెకుంటున్న వారి వివరాలు సైతం..

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో మరో హామీకి కసరత్తు మొదలైంది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారి వివరాల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల నుంచి వినియోగదారుల వారీగా ఇచ్చే బిల్లుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సెల్ నంబర్ వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే ఉచిత విద్యుత్ అమలు చేయనున్నారు.



ధారూరులో పర్యటిస్తున్న రాష్ట్ర ట్రాన్స్‌కో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ సుధామాధురి

పత్రాలు తప్పనిసరి

విద్యుత్ సిబ్బంది వివరాలు నమోదు చేసుకునేందుకు వచ్చినప్పుడు వినియోగదారులు తమ ఆధార్‌కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు(ఎఫ్‌ఎస్‌సీ), సెల్ నంబరు వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఇటీవల ప్రజాపాలన కింద దరఖాస్తు చేసుకున్నా, సిబ్బందికి ప్రస్తుతం వివరాలు అందజేయాలని అధికారులు చెబుతున్నారు.

నమోదు షురూ

- పథకానికి తెల్లరేషన్‌కార్డు ఉన్న వారు మాత్రమే అర్హులని ప్రభుత్వం స్పష్టం చేసింది.
- 200లోపు యూనిట్లు వినియోగించుకునే గృహస్తుల వివరాలను విద్యుత్ సిబ్బంది నమోదు చేస్తోంది.
- ఈ ప్రక్రియ ఈ నెల 6 నుంచి ప్రారంభమై 15 వరకు కొనసాగే అవకాశం ఉంది.
- ఒకే ఇంట్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ మీటర్లు ఉన్నా ఒకే మీటరుకు ఈ పథకం వర్తిస్తుంది. ఒకవేళ అద్దె ఇంట్లో ఉన్న వాళ్లు వినియోగిస్తున్న యూనిట్లు కూడా నమోదు చేస్తారు.
- ఒకే ఇంట్లో రెండు మీటర్లు ఉండి కుటుంబసభ్యులు వేరువేరుగా ఉంటే రెండింటి వివరాలు సేకరిస్తారు.
- కొందరు మీటర్ లేకుండానే విద్యుత్ వినియోగిస్తున్నారు. అలాంటి వారు కచ్చితంగా సర్వీస్ నంబరు పొందితేనే వివరాలు తీసుకుంటారు.
- సిబ్బంది నమోదుకు వచ్చినప్పుడు ఇంట్లో ఎవరూ లేకుంటే మీటరు వద్ద వివరాలు రాసి పెట్టాలని సూచిస్తున్నారు.

క్లుప్తంగా

వింత శబ్దాలు.. విద్యార్థుల బెంబేలు



హాస్టల్ భవనం

నవాబుపేట: రాత్రి వేళ ఏవేవో వింత శబ్దాలు వినిపిస్తున్నాయని నవాబుపేటలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు పేర్కొంటున్నారు. ఈ కారణంతో వసతి గృహంలో ఉంటున్న 98 మందిలో సగం మంది ఇళ్లకు వెళ్లిపోయారు. కానీ అలాంటి శబ్దాలు ఏవీ రావడం లేదని, హాస్టల్ భవనం పొలాల మధ్య ఉండటంతో రాత్రి వేళ పక్షుల శబ్దాలు వినిపిస్తాయని చెప్పారు. ఈ విషయమై విద్యార్థులకు ధైర్యం చెబుతున్నామని, పోలీసులు సైతం పెట్రోలింగ్ చేస్తున్నారని, త్వరలోనే అవగాహన సమావేశం నిర్వహిస్తామని ప్రిన్సిపల్ సత్యసిద్ధార్థిని తెలిపారు.

అనారోగ్యంతో తల్లి మృతి

తలకొరివి పెట్టిన కూతురు

నందిగామ: గతేడాది అనారోగ్యంతో తండ్రి చనిపోయాడు. నేడు తల్లి సైతం మృతి చెందింది. ఆ దంపతులకు ఉన్న ఇద్దరు కూతుళ్లలో ఒకరికి వివాహం అవ్వగా చిన్న కూతురు తల్లి వద్దే ఉంటోంది. తల్లి మరణంతో ఆ చిన్నారి గుండెలవిసేలా రోదించింది. తలకొరివి సైతం చిన్న కూతురే పెట్టింది. హృదయ విదారక సంఘటన మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నందిగామకు చెందిన ఏకుల శంకరమ్మ, ఎల్లయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంటారు. ఎల్లయ్య తన పెద్ద కూతురికి వివాహం చేశారు. గతేడాది ఆయన అనారోగ్యానికి గురై మృతి చెందారు. దీంతో శంకరమ్మ చిన్న కూతురు రాధికతో కలిసి ఉంటోంది. ఆమె దినసరి కూలీ పనులు చేస్తుండగా రాధిక కుట్టు మిషన్‌తో చేదోడు వాదోడుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో శంకరమ్మ ఇటీవల అనారోగ్యానికి గురైంది. మంగళవారం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న బంధుమిత్రులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొడంగల్ రూరల్: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి లారీ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణ శివారులోని రావులపల్లి రోడ్ సిద్ధార్థ స్కూల్ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకొంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామానికి చెందిన చిన్న పకీరప్ప పనుల నిమిత్తం కొడంగల్‌కు వెళ్లాడు. తిరిగి సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో పట్టణశివారులోని రావులపల్లి రోడ్ సిద్ధార్థ స్కూల్ సమీపంలో వెనక నుంచి లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో చిన్న పకీరప్ప కాలుకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

జానపద కళల పరిరక్షణకు కృషి

గన్‌ఫౌండ్రీ: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేవి జానపద కళలేనని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జానపద కళల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గత రెండురోజులుగా రవీంద్ర భారతిలో కళాకృతి నృత్యాలయ, ది డ్యాన్స్ ఇండియాల ఆధ్వర్యంలో జరుగుతున్న యాదాద్రి జాతీయ నృత్యోత్సవ వేడుకలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భారతదేశంలోని వివిధ కళారూపాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు.

నష్టాలతో మార్కెట్ మూత

- అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో పాలనాఖర్చుల మోత
- నిరాశలో వినియోగదారులు



మోమిన్‌పేటలో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కార్యాలయం

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో ఏర్పాటైన అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వరుసగా మూడు సంవత్సరాలు నష్టాల్లోనే కూరుకుపోయింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి నాణ్యమైన కూరగాయలను వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీని రూపొందించారు. 2019–20 సంవత్సరంలోఎన్‌ఆర్‌ఎల్‌ఎం(జాతీయగ్రామీణజీవనోపాధులపథకం) కింద కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలను విడుదల చేసింది. కంపెనీలో సభ్యులుగా చేరిన రైతులు సభ్యత్వ నమోదు కింద మూడేళ్లకు రూ.1,73,600 చెల్లించారు. గ్రామాలలో ఏర్పాటైన మహిళ రైతు సంఘాల ద్వారా వాటా మూలధనం రూ.6,85,200 చెల్లించారు. డీఆర్‌డీఏ ద్వారా కంపెనీకి రూ.3,88,828 అందాయి. మొదటి మూడేళ్లు రైతుల నుంచి కూరగాయలు రూ.1.37 కోట్లు కొనుగోలు చేసి హైదరాబాదులోని బెనిషాన్ కంపెనీకి అమ్మారు. బెనిషాన్ కంపెనీ నుంచి రైతు ఉత్పత్తిదారుల సంస్థకు రూ.1.48 కోట్లు వచ్చాయి. వచ్చిన నామమాత్రపు లాభాలకు తోడు పరిపాలన ఖర్చులకు గాను రూ.16 లక్షలు వెచ్చించారు. కూలీ, రవాణా కల్పనకు అదనంగా ఖర్చు చేశారు. దీంతో తీవ్ర నష్టాల్లో కంపెనీ కూరుకుపోయింది.

గిట్టుబాటు ధర కల్పనకు

పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను అందించాలనే లక్ష్యంతో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీని ఏర్పాటు చేశారు. కానీ కంపెనీ నష్టాల్లోకి వెళ్లింది. రైతుల పొలాల నుంచి కంపెనీకి తీసుకువచ్చేందుకు రవాణా, పంట కోసేందుకు కూలీలను కూడా కంపెనీ భరించింది. కంపెనీలో సభ్యులుగా చేరి పండించిన కూరగాయలను అమ్మితే గిట్టుబాటు కల్పించడంతో పాటు వచ్చిన లాభాలలో రైతులకు బోనస్ సైతం ఇస్తామని పేర్కొన్నారు. కానీ వరుస నష్టాలతో కంపెనీ కూరుకుపోయింది. ప్రస్తుతం కూరగాయల కొనుగోలును నిలిపి వేశారు.

అవగాహన లేమి

అనంతగిరి అలుగడ్డ బ్రాండుపై 2021లో వినియోగదారులకు కిలో ప్యాకెట్ల ద్వారా అందించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. రైతులకు గిట్టుబాటు ధరను అందించడంతో పాటు వినియోగదారులకు మార్కెట్ రేటుకు విక్రయించారు. దళారులు లేకుండా నాణ్యమైన అలును వినియోగదారులకు అందించారు. గతేడాది నాణ్యమైన విత్తనాలను కంపెనీ తరఫున బోర్డు సభ్యులు ఆగ్రాలో కొనుగోలు చేసిన 440 క్వింటాళ్లు 70 మంది రైతులకు పంపిణీ చేశారు. ఉద్యానశాఖ అధికారుల పర్యవేక్షణలో పంట సాగును కొనసాగించారు. కానీ 2022లో అవగాహన లేమితో కొనుగోలు చేసిన విత్తనాలు నష్టాలు సృష్టించాయి. అప్పటి నుంచి అనంతగిరి అలుకు మంగళం పాడారు.

ప్రచారం చేయలేక

మండల కేంద్రంలో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి అదనంగా ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా రూ.27లక్షలతో రెండు ట్రాక్టరులు, ఆధునిక వ్యవసాయ పరికరాలను రైతులకు చౌకధరలకు అద్దెకు ఇచ్చేందుకు అప్పట్లో కొనుగోలు చేశారు. రూ.5 లక్షల నిధులతో ఏరువాక కేంద్రంలో షెడ్‌ను నిర్మించారు. ప్రచారం చేయలేక గ్రామాలలో ఇప్పటికే ఉన్న ట్రాక్టర్ల పోటీకి తట్టుకోలేక నామమాత్రంగానే నడుస్తున్నాయి. వాటి ద్వారా కూడా నష్టాలే మిగులుతున్నాయి.

బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్
- సిలిండర్ పేలి గాయపడ్డ సిబ్బందికి పరామర్శ


గాయపడిన మహిళను పరామర్శిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

తాండూరు టౌన్: యాలాల బీసీ బాలికల వసతి గృహంలో సోమవారం ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి గాయాల పాలైన సిబ్బందిని ప్రభుత్వమే ఆదుకోవాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం తాండూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సిబ్బంది అనిత, బసమ్మ, ఫరానా బేగంలను సంఘం నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పన అంతంత మాత్రంగానే ఉంటున్నాయన్నారు. గాయపడిన ముగ్గురిని హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పి ప్రభుత్వం పూర్తి స్థాయి చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు నాయకులు లక్ష్మణాచారి, షుకూర్, వెంకటేశ్, వెంకట్, నవీన్, రమేశ్ తదితరులు ఉన్నారు.

తాత లేడని.. మనవడి ఆత్మహత్య


ప్రభాకర్ (ఫైల్)

బొంరాస్‌పేట: చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేసిన తాత మరణంతో ఆ మనవడి గుండె రోదించింది. ఈ వ్యథను తట్టుకోలేక యువకుడు ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతకింది ప్రభాకర్(24) తండ్రి పరమేశ్ చిన్నతనంలోనే కోల్పోయాడు. అప్పటి నుంచి తాత చిన్నబసయ్య బాగోగులు చూస్తున్నాడు. గత నెల క్రితం పొలం నుంచి ఇంటికి వస్తుండగా బైక్ ఢీకొని రోడ్డు ప్రమాదంలో తాత చనిపోయాడు. దీంతో తాతలేని కారణంగా ప్రభాకర్ మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు. తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలే..

మృతుడి ప్రభాకర్ తండ్రి బైక్‌పై వెళ్తుండగా మండల పరిధిలోని జాతీయ రహదారిపై ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గత నెల 9న తాత పొలం నుంచి ఇంటికి వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని చనిపోవడం ఊహించని విషాదాన్ని నింపాయి. మృతుడికి తల్లి, డిగ్రీ చదువుతున్న చెల్లి ఉన్నారు.

పేదలకు అండగా సీపీఐ


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: కార్మికులు, కర్షకులకు ఎప్పుడూ అండగా నిలిచి పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి పేర్కొన్నారు. మండలంలోని కందవాడలో బుధవారం గ్రామ కమిటీ అధ్యక్షుడు బల్వంత్‌రెడ్డి అధ్యక్షతన సీపీఐ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. రోజురోజుకు ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుందని భవిష్యత్తులో మోదీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని, లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందన్నారు. సీపీఐ పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కందవాడ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శిగా ఎలిషా, సహాయ కార్యదర్శులుగా యాదమ్మ, ఎర్ర బీరప్ప, సత్తయ్య, బాలరాజు సభ్యులుగా లతా, రాములమ్మ, ఎర్ర యాదయ్య, రామచంద్రయ్య, వినోద్, ఎర్ర గోపాల్, మల్లేశ్, బుచ్చయ్య, భాగ్యమ్మ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సత్తిరెడ్డి, ఎండీ మాక్బుల్, శౌరీలు, మంజుల, వెంకటమ్మ, లలిత, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు


అభిలాశ్‌రెడ్డి (ఫైల్)

యాలాల: రెసిడెన్షియల్ పాఠశాల నుంచి ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బంటారం మండలానికి చెందిన అభిలాశ్‌రెడ్డి ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి అతడు వెళ్లిపోయాడు. విషయాన్ని గమనించిన పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. స్థానికులతో కలిసి చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ హుండీ చోరీ

తలకొండపల్లి: మండల పరిధిలోని మల్లప్పగుట్ట ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ సీతారాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దుండగులు హుండీని అపహరించారు. గేటు తాళం పగులగొట్టి ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేశారు. అందులోని రూ.5,000 నగదును దోచుకున్నారు. ఆలయ నిర్వాహకుడు పెంటారెడ్డి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

- సూర్యాపేటను సందర్శించిన షాద్‌నగర్ కౌన్సిల్ సభ్యులు


ఎరువుల తయారీ యంత్రాన్ని పరిశీలిస్తున్న షాద్‌నగర్ మున్సిపాలిటీ పాలక మండలి సభ్యులు

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు బుధవారం సూర్యాపేటను సందర్శించారు. అక్కడ డంపింగ్ యార్డు, మురుగు నీటి శుద్ధి కేంద్రం, తడి చెత్తతో ఎరువులు తయారు చేసే కేంద్రాలను పాలక మండలి సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ.. సూర్యాపేట తరహాలో షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు పావని, కౌసల్య, శ్రీనివాస్, లతా శ్రీ,శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్‌రాజు, ప్రతాప్‌రెడ్డి, శారద, అంతయ్య, నర్సింహ, మానస, ప్రేమలత, మహేశ్వరి, శ్రీనివాస్, సరిత, విశాల, నందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


శ్రీను మృతదేహం

షాబాద్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. షాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇడిగా శ్రీను(30) గ్రామంలో బజ్జీల బండి నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వచ్చి గ్రామ సమీపంలోని వ్యవసాయ ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మృతికి సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచుల హయాంలోనే అభివృద్ధి


సర్పంచులను సన్మానించిన అనితారెడ్డి, సబితారెడ్డి తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి
- ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: పదవికే విరమణ తప్పా ప్రజా సేవకు కాదని జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశపుహాల్‌లో ఎంపీపీ మంద జ్యోతిపాండు, ఎంపీడీఓ వెంకట్రాములు ఆధ్వర్యంలో ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న మండల పరిధిలోని సర్పంచులకు వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. కరోనా కాలంలో సైతం ప్రాణాలను ఫణంగా పెట్టి గ్రామాల్లో ప్రజలకు సేవలందించారని కొనియాడారు. కేసీఆర్ సంకల్పంతో సర్పంచుల హయాంలో జరిగిన పల్లె ప్రగతి పనులు, అభివృద్ధి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అందరూ ఎంతో బాధ్యతగా తమ విధులను నిర్వహించారన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు విరివిగా నాటి హరిత విప్లవానికి నాంది పలికారన్నారు. ఇదంతా సర్పంచుల కృషితోనే సాధ్యమైయిందన్నారు. అనంతరం మాజీ సర్పంచులను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, మాజీ ఎంపీపీ పెద్ద రామయ్య, ఎంపీటీసీలు ఎల్మటి లక్ష్మీ, ఇందిర, రాజమ్మ, రాజశేఖర్‌రెడ్డి, రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం ముఖ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ల సమావేశం

ఇబ్రహీంపట్నం: పల్లెలన్నీ పరిశుభ్రంగా ఉండాలని.. అందుకు స్పెషల్ ఆఫీసర్స్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశించారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా నియోజకవర్గంలోని గ్రామ స్పెషల్ ఆఫీసర్లకు సమావేశాన్ని బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలు గ్రామాల ముఖ ద్వారం వద్దనే ముళ్ల చెట్లు, చెత్తాచెదారం, మురికి పేరుకుపోయి దుర్వాసన వస్తుందన్నారు. అలాంటి గ్రామాల పరిస్థితులను పూర్తిగా మార్చి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాల భవనాలకు రంగులు వేసి పరిశుభ్ర వాతావరణాన్ని విద్యార్థులకు కల్పించాలన్నారు. సర్పంచ్‌లు లేని లోటును స్పెషలాఫీసర్లు తీర్చాలన్నారు. రాజకీయాలకు పక్కకు పెట్టి గ్రామాభివృద్ధిలో ప్రజలు, వివిధ రాజకీయ పక్షాలు భాగస్వాములు కావాలన్నారు. ఈ నెల 15న సన్మాన కార్యక్రమాలను నిర్వహించి అవార్డులను అందజేస్తామన్నారు.

రూ.10 కోట్లు మంజూరు

గ్రామాలల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని.. ఈ నెల చివరిలోగా నీటి సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి జాబితాను ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకొని నీటి కోటాను పెంచి, సక్రమంగా సరఫరా చేయాలన్నారు. గ్రామాలాభివృద్ధికి రూ.పది కోట్లను తాను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లూజ్ లైన్లను సరిచేసి వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం, యాచారం ఎంపీపీలు కృపేశ్, కొప్పు సుకన్య, అడిషనల్ డీఆర్‌డీఏ పీడీ నీరజా, ఎంపీడీలు శ్రీనివాస్, వెంకటమ్మ, తహసీల్దార్ అన్వర్‌తోపాటు నియోజకవర్గ స్పెషలాఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

కలగానే జూనియర్ కళాశాల!

- ఇంటర్ విద్యకు విద్యార్థులు దూరం
- హామీలకే పరిమితమవుతున్న నేతలు
- ఏర్పాటు చేయాలంటున్న కొందుర్గువాసులు


కొందుర్గులో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం దీక్ష చేపట్టిన యువకులు (ఫైల్)

కొందుర్గు: ప్రభుత్వాలు మారినా పాలకుల తీరు మారడం లేదు. కొందుర్గులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని చాలా కాలంగా మండలవాసులు అభ్యర్థిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఉద్యమకాలంలో స్థానికులు ఆశించారు. కానీ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా కొందుర్గు రాత మారడం లేదని వాపోతున్నారు. 2018లో కొందుర్గు గ్రామానికి చెందిన పెరుమాళ్ల చంద్రశేఖర్ నిరాహారదీక్ష చేపట్టారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు దీక్షకు మద్దతునిచ్చాయి. అప్పట్లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హామీ మేరకు ఆయన దీక్ష విరమించారు. అనంతరం కళాశాల ఏర్పాటు కోసం కార్పస్ ఫండ్ కింద రూ.3.15 లక్షలు చెల్లించాలని సూచించడంతో మండల కేంద్రంలోనే దాదాపు రూ.86 వేలు విరాళాలు సేకరించారు. అయినా నేటికీ కళాశాల ఏర్పాటు కాలేదు.

ఉన్నత చదువులకు దూరం

కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించి 46 గ్రామ పంచాయతీలకు గాను రెండు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, రెండు గురుకుల పాఠశాలలతోపాటు ఆరు ఉన్నత పాఠశాలలు, 15 ప్రాథమికోన్నత, 49 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 4 ప్రైవేటు పాఠశాలలు సైతం ఉన్నాయి. వీటిలో పదో తరగతి పూర్తిచేసి ఏటా దాదాపు 400 మంది వరకు జూనియర్ కళాశాలలో ఉన్నత చదువుల కోసం వెళుతున్నారు. కానీ అందుబాటులో కళాశాల లేకపోవడంతో షాద్‌నగర్, మొగిలిగిద్ద, పరిగి, మహబూబ్‌నగర్ పట్టణాలను ఆశ్రయిస్తున్నారు. ఇక ఆర్థిక స్థోమత లేనివారు అర్ధాంతరంగా చదువు మానేస్తున్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఒక్క కళాశాలా లేదు



కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ రెండు మండలాల్లో కలిసి ఒక్క జూనియర్ కళాశాల లేకపోవడం చాలా బాధాకరం. గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా స్థాయి పెంచుతున్నామని గత ప్రభుత్వం దాటవేసింది. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమయినా కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– తొండపల్లి దర్శన్, బీఎస్పీ నాయకులు

ఏర్పాటుకు కృషి చేస్తా



కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో జూనియర్ కళాశాల లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావడం బాధాకరం. ఆయా మండలాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తా.

– వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే